అబ్జర్వర్‌కు కలెక్టర్, ఎస్పీ స్వాగతం

జహీరాబాద్ పార్లమెంట్ పరిశీలకుడికి పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, ఏప్రిల్ 26 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మోతీలాల్ పెటే శుక్రవారం కామారెడ్డికి విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ ఆయనకు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, వ్యయ నిర్వహణ కమిటీ, సహాయ వ్యయ పరిశీలకుల నియామకం, వ్యయ మానిటరింగ్ చేస్తున్న తీరు గురించి ఆయనకు వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని చిన్నమల్లారెడ్డి, లింగాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలని సూచించారు. రైతులకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు సూచించారు. జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలకుగాను 290 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 17,810 మంది రైతుల నుంచి 1,09,489 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు 124.39 కోట్ల రూపాయలు జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జునబాబు, ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంకటేశ్ (ఫైల్)

రామారెడ్డి, ఏప్రిల్ 26: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దికుంట గ్రామానికి చెందిన చొక్కి వెంకటేశ్ శుక్రవారం మహారాష్ట్ర ప్రాంతానికి బైక్‌పై వెళ్లాడు. ఈ క్రమంలో నాందెడ్ సమీపంలో వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో మృతిచెందాడు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

భిక్కనూరు, ఏప్రిల్ 26 : మండలం జంగంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన బట్ట పరశురాములు(35)ను భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెలను హతమార్చిన గుర్తు తెలియని వ్యక్తులు

మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

గాంధారి, ఏప్రిల్ 26: మూడు గొర్రె పొట్టేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చిన ఘటన మండలంలోని ముదెల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒల్లెపు మైశయ్య తమ ఇంట్లో ఆదివారం దావత్ ఉండడంతో గురువారం బాన్సువాడ అంగడికి వెళ్లి రూ.30 వేలతో మూడు గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. వాటిని ఇంటి ఆవరణలో కట్టేయగా, గుర్తుతెలియని వ్యక్తులు వాటిని కత్తితో పొడిచి, మెడలు విరిచి చంపేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు మైశయ్య తెలిపాడు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వరంగ సంస్థ)

కామారెడ్డి
ప్రధాన శాఖ (02151)

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

శ్రీ నల్లోల రాజు (రుణగ్రహీత) మరియు శ్రీమతి గైని ప్రియ అలియాస్ రూప భర్త నల్లోల రాజు (సహ-రుణగ్రహీత) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కామారెడ్డి ప్రధాన శాఖ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి **03-10-2023 నాటికి రూ. 21,28,872/- + వడ్డీ+ ఇతర చార్జీలను** రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కామారెడ్డి ప్రధాన శాఖ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది ఎక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన **29-05-2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర: **రూ. 31,28,000/-** మరియు బయానా డిపాజిట్: **రూ. 3,12,800/-. అప్లికెంట్: శ్రీ నల్లోల రాజు** తండ్రి సాయిలు బుచ్చయ్య, ఇ.నం. 6-10-24, హమాలీవాడీ, నిజామాబాద్, తెలంగాణ-503002, మొబైల్: 7989694523. **కో-అప్లికెంట్: శ్రీమతి గైని ప్రియ అలియాస్ రూప** భర్త నల్లోల రాజు, ఇ.నం. 5-6-244, NGO's కాలనీ, కామారెడ్డి, తెలంగాణ-503111, మొబైల్: 9440659812.

సరిసమాన తనఖాపెట్టిన ఆస్తి: M.C., M.P మరియు Z.P & రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కామారెడ్డి & రిజిస్ట్రేషన్ జిల్లా నిజామాబాద్ పరిధిలో కామారెడ్డి టౌన్, మండలం & జిల్లా, దేవన్‌పల్లి వద్దగల కవర్ అయిన ప్లింత్ ఏరియా 745.4 చ.అడుగులు మరియు విస్తీర్ణం ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు: 50'.0'' అడుగులు మరియు తూర్పు నుండి పడమర: 20'.1 1/2" అడుగులు, మొత్తం విస్తీర్ణం 1006.25 చ.అడుగులు (111.80 చ.గజాలు), 93.48 చ.మీటర్లకు సమానం, G.P L.P No. 3/86 ప్రకారం సర్వే నం. 212/2Aలోగల ఖాళీ ప్లాట్ నం. 12 యొక్క తూర్పు సగం పోర్షన్‌పై నిర్మించిన కొత్త సెమీ ఫినిష్డ్ RCC రూఫ్ ఇల్లు మొత్తం.**సేల్ డీడ్ & వాల్యుయేషన్ రిపోర్ట్ ప్రకారం సరిహద్దులు:** ఉత్తరం: M.A. రఫీక్ యొక్క భూమి, దక్షిణం: 30 అ.వెడల్పు రోడ్, తూర్పు: పొరుగువారి ఖాళీ ప్లాట్, పడమర: ఖాళీ ప్లాట్ నం. 12 యొక్క మిగిలిన పడమర పోర్షన్.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు: తెలియవు

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా **www.unionbankofindia.co.in, http://www.ibapi.in &** సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ అనగా **www.mstcecommerce.com**లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.

తేదీ: 23-04-2024 అధీకృత అధికారి
ప్రదేశం: కామారెడ్డి

స్టాట్యుటరీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 30/15 రోజుల అమ్మకం ప్రకటన

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 26 : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు రెండో విడుత ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని శుక్రవారం కేటాయించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈ ప్రక్రియను పారదర్శకంగా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఏర్పాటు చేయనున్న 913 పోలింగ్ కేంద్రాలకుగాను 20 శాతం అదనపు సిబ్బందితో ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలింగ్ సిబ్బందితో కలిపి 1093 బృందాలను కేటాయించినట్లు చెప్పారు. మొదటి విడుతలో 30 శాతం అదనంగా.. 85 మంది మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా సంగారెడ్డిలో ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జీ తివారి సమక్షంలో నిర్వహించామని వివరించారు. 4,388 మంది పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై మొదటి విడుత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీవో రాజారామ్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి వరదారెడ్డి, రాష్ట్ర ఎన్ఐసీ అధికారి రవి, జిల్లా ఎన్ఐసీ అధికారి శ్రీకాంత్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మహనీయులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలి

ఉస్మానియా విశ్వ విద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆడెపు సత్యనారాయణ

భిక్కనూరు, ఏప్రిల్ 26 : మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఉస్మానియా విశ్వ విద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆడెపు సత్యనారాయణ అన్నారు. తెలంగాణ విశ్వ విద్యాలయం దక్షిణ ప్రాంగణంలో శుక్రవారం మహనీయుల జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇదే నెలలో భారత దేశంలో జన్మించిన ముగ్గురు మహాను భావులు జయంతిని జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఉమెన్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలకు ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు రాజేశ్వరి, మోహన్‌బాబు, ప్రతిజ్ఞ, సబిత, లలిత, హరిత, సునీత, హాస్టల్ వార్డెన్ యాలాద్రి నారాయణ, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆడెపు సత్యనారాయణ

నేడు వర్ని, మోస్రాలో బీఆర్ఎస్ ప్రచారం

బాన్సువాడ, ఏప్రిల్ 26 : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున బరిలో ఉన్న అభ్యర్థి గాలి అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు వర్నిలో, 7 గంటలకు చందూరులో, 8 గంటలకు మోస్రా మండల కేంద్రంలో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వంద శాతం ఓటింగ్‌కు కృషిచేయాలి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్

మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్

బాన్సువాడ, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్‌కు అధికారులు కృషి చేయాలని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో రమేశ్ రాథోడ్ సూచించారు. బాన్సువాడ ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో బాన్సువాడ నియోజక వర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇప్పటికే పోలింగ్ స్లిప్పులను పంపిణీ బీఎల్వోలతో ప్రారంభించామని అన్నారు. పోలింగ్ స్టేషన్లలో వసతులపై ఆయన ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో తాగునీరు, షెడ్డు ఏర్పాటు, పోలింగ్ స్టాఫ్‌కు భోజనం, పోలింగ్ బూత్‌వద్ద టాయిలెట్స్, కరెంటు, ఫ్యాన్లు, దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర 12 రకాల ఆధార పత్రాల్లో ఏదో ఒక దానితో పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రూ.50 వేలకు మించి నగదును తరలించొద్దు

బాన్సువాడ, ఏప్రిల్ 26 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలకు మించి నగదు తరలించొద్దని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రమేశ్ రాథోడ్ తెలిపారు. రూ.50 వేలకు మించి డబ్బులను తీసుకెళ్తే సీజ్ చేస్తామని చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.17 లక్షల 11వేల 600ను 13 మంది నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తొమ్మిది మంది సంబంధిత పత్రాలతో రావడంతో వారి రూ.11 లక్షల 18 వేల 700 రిలీజ్ చేశామని చెప్పారు. మిగిలిన నలుగురికి సంబంధించిన రూ.5 లక్షల 92 వేల 900 సీజింగ్‌లో ఉన్నాయని, వారు సంబంధిత పత్రాలు తీసుకురాని యెడల ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు ఎక్కువ నగదును వెంట పెట్టుకొని వెళ్లొద్దని సూచించారు.

కొనసాగుతున్న ఓపెన్ ఇంటర్, పదోతరగతి పరీక్షలు

కామారెడ్డి, ఏప్రిల్ 26 : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ ఇంగ్లిష్ పరీక్ష ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 1200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,054 మంది హాజరయ్యారు. 146 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 844 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 739 మంది హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు.

పుస్తె, మెట్టెల అందజేత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న కరీంనగర్ డెయిరీ సూపర్‌వైజర్ రాకేశ్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 26 : మండలంలోని క్యాసంపల్లి తండా గ్రామంలో శుక్రవారం కరీంనగర్ డెయిరీలో పాల ఉత్పత్తిదారుడు భూక్యాలాలు కుమార్తె అఖిలకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలను అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ డెయిరీ సూపర్‌వైజర్ రాకేశ్, అధ్యక్షుడు భూక్యా రవి, సెక్రటరీ విస్లావత్ గణేశ్, పాడి రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

పోటీల్లో తలపడుతున్న యువతులు



విజేతలకు వెండి కడియం బహూకరిస్తున్న మాజీ స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 26 : భేతాళ స్వామి జాతర సందర్భంగా బాన్సువాడ పట్టణంలో ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం కుస్తీపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బాన్సువాడ చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి బహుమతులను అందజేశారు. హర్యానా నుంచి వచ్చిన మహిళా మల్లయోధులు ఈ కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి పోచారం వెండి కడియంతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలను చూడడానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మాచారెడ్డి, ఏప్రిల్ 26 : పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వాగులో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుకతోపాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 26 : మండలంలోని మైలారం, రాముల గుట్ట, నస్రుల్లాబాద్, లింగంపల్లి తండా తదితర గ్రామాల్లో శుక్రవారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం 20,932 ఓటరు స్లిప్పులకుగాను 2,296 పంపిణీ చేశామన్నారు. ఈ వచ్చే నెల 8వ తేదీ వరకు స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హన్మాండ్లు, గ్రామ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చదువుల తల్లికి జాజాల అభినందన

గతంలో ఈ విద్యార్థినికి రూ.10లక్షల ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్సీ కవిత

అఖిలను అభినందిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్

రామారెడ్డి, ఏప్రిల్ 26: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కంచర్ల అఖిల బైపీసీలో 990 మార్కులతో ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా ఆమెను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెలే జాజాల సురేందర్ శుక్రవారం సన్మానించారు. ఈ చదువుల తల్లి గతంలో తీవ్ర అనారోగ్యానికి గురైతే చికిత్స కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత డబ్బులు రూ. 10లక్షలు అందజేశారు. నేడు ఆ బాలిక పూర్తి ఆరోగ్యంతో ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని జాజాల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు, జడ్పీటీసీ నర్సింహులు, సీనియర్ నాయకులు సాయాగౌడ్, గైని రమేశ్, బాల్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులు ప్రారంభించాలి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 26 : మండలంలోని అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పది పాఠశాలల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మి, నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశం

తనిఖీలు ముమ్మరం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. సదాశివనగర్ మండలం దగ్గి చెక్‌పోస్టు వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై పోలీసులు శుక్రవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, 50 మంది సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు.

–రామారెడ్డి, ఏప్రిల్ 26

టీ పాయింట్ వద్ద గంజాయి పట్టివేత

కామారెడ్డి, ఏప్రిల్ 26 : జిల్లా కేంద్రంలోని ఓ టీ పాయింట్ దగ్గర దాడులు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న శ్రీ ఆంజనేయ టీ పాయింట్ వద్ద ఏడు ప్యాకెట్ల గంజాయి లభించిందని, నిర్వాహకుడు కడారి స్వామిపై కేసు నమోదు చేసి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిజామాబాద్‌లోని ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న ఫరీదాబేగం దగ్గర స్వామి గంజాయిని కొనుగోలు చేశాడని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫరీదాబేగం ఇంట్లో తనిఖీలు చేపట్టగా 3.48 కిలోల గంజాయిని లభించిందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో అధికారులు హన్మంత్ రావు, ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్ కుమార్, సిబ్బంది భాస్కర్, మైసరాజు, సద్ది రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

SSC MEMO పోయినది

★SAMA SHIVA REDDY S/o SAMA MUTHYAM నాయొక్క SSC మెమో Roll No.1905124898 కొత్త ఇంటికి మారినప్పుడు పోయినది. ఎవరికైన దొరికినచో క్రింది నెంబర్‌లో తెలుపగలరు. Cell:7093271257.

NTZ-324648

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.